అన్నదాతకు అపార నష్టం

- ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలు...
- పంట పొలాల్లో నిలిచిన వర్షపునీరు
- ఎర్రబారిన పత్తి
- ఆందోళనలో రైతన్నలు



సంతెకూడ్లూరు వద్ద నీట మునిగిన పత్తి పంట



పత్తి పంటలో నిలిచిన వర్షపునీరు

ఆదోని రూరల్: అతివృష్టి, అనావృష్టి కారణంగా ప్రతిఏటా రైతన్నలు ఏదో రూపంలో నష్టపోతూనే ఉన్నారు. ఈ ఏడాది ముందస్తు వర్షాలు కురవగా.. ఆతరువాత వరుణుడు ముఖం చాడేశారు. ప్రస్తుతం ఎడతెరిపిలేకుండా కురుస్తున్న వర్షాలు రైతులు సాగుచేసిన పత్తి పొలాల్లోకి నీరు చేరి పైరు ఎర్రబారింది. మొక్కలకు కాచిన మొగ్గలు సైతం రాలిపోతున్నాయి. మిగిలి కాయలు కుళ్లి పోతున్నాయి. దీంతో రైతులు దిగాలు చెందుతున్నారు.

ఆదోని మండలంలో పంటల సాగు

మండలంలో పత్తి 22,263 హెక్టార్లు, కొర్ర 111 హెక్టార్లు, వరి 235 హెక్టర్లు, మిరప 1,053, టమాట 41, ఉల్లిగడ్డలు 145 హెక్టార్లు, వేరుశనగ 1010, ఆముదం 132 హెక్టార్లలో పంటలు సాగయ్యాయి. ఆదోని మండలంలో గత వారం రోజులుగా 59 శాతానికి పైగా వర్షపాతం నమోదవుతూ వస్తోంది. మండలంలోని సంతెకూడ్లూరు, పెద్దహరివాణం, బసాపురం, నాగనాథనహళ్లి, నారాయణపురం, ఢణాపురం, మదిరె, అలసందగుత్తి, బసరకోడు, దిబ్బనకల్లు తదితర గ్రామాల్లో పంట పొలాలు వర్షపునీటితో మునిగిపోయాయి. అధికంగా తెల్లబంగారామైన పత్తి పంట ఎక్కువ దెబ్బతింది. దాదాపు 15 హెక్టార్లలో పత్తి పంట పూర్తిగా ఎర్రబారి మొగ్గలు రాలిపోయాయి. దీంతో అన్నదాతలు తీవ్రంగా నష్టపోయారు. అలాగే టమాట, మిరప, వరి, ఆముదం, ఉల్లిగడ్డ పంట పొలాల్లో వర్షపునీరు నిల్వడంతో పంటలు దెబ్బతిన్నాయి.

రైతులు జాగ్రత్తలు పాటించాలి



పత్తి పంటలో వర్షపునీరు నిలబడితే పూత, పిందె, రాయలు రాలిపోవడంతో, ఆకులు ఎర్రబడి వాడిపోయి రాలిపోవడం జరుగుతుంది. పొలంలో నిలబడి ఉన్న నీటిని తీసివేసేలా రైతులు చర్యలు తీసుకోవాలి. ఎకరాకు 25–30 కిలోల యూరియా, 10–15 కిలోల మ్యూరేట్ ఆఫ్ పొటాష్‌ను అదనంగా వేయాలి. అదేవిధంగా వరి పొలంలో నిలిచిన ఉన్న ముంపు నీటిని వీలైనంత త్వరగా బయటకు పంపాలి. వరద ముంపును తట్టుకునే రకాలను సాగు చేయాలి.

– సుధాకర్, మండల వ్యవసాయ అధికారి

నాలుగు ఎకరాల్లో పత్తి పంట నష్టపోయా



నాకున్న ఎకరన్న పొలంతో పాటు రెండున్నర ఎకరాలను కౌలుకు తీసుకుని పత్తి పంటను సాగుచేశా. వారం రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు పంట పొలంలో వర్షపునీరు నిలిచింది. దీంతో పత్తి పింజలు, పూత రాలిపోయింది. పంట ఎర్రబారింది. పంట సాగుకు ఎకరాకు రూ.50 వేలు చొప్పున పెట్టాను. కౌలుకు ఎకరాకు రూ.10 వేలు చొప్పున చెల్లించాల్సి ఉంది. ఏమి చేయాలో తెలియని పరిస్థితి. – బోయ కృష్ణ, రైతు, మాంత్రికి

ప్రభుత్వం ఆదుకోవాలి



నాకు సొంత భూమి మూడు ఎకరాలు ఉంది. అదనంగా ఏడు ఎకరాలు కౌలుకు తీసుకుని పత్తి పంట వేశా. ఎడతెరిపిలేని వర్షాలకు పంట పొలంలో వర్షంపు నీరు నిల్వ ఉండడంతో పంట పూర్తిగా ఎర్రబారింది. కాయ, పిందెలు రాలిపోతున్నాయి. ఎకరాకు కౌలుకు రూ.15 వేలు చెల్లించాల్సి ఉంది, పెట్టుబడి ఎకరాకు రూ.50 వేలు చొప్పున పెట్టాను. పంట చేతికొచ్చే పరిస్థితి కనిపించడం లేదు. దీంతో ఏమి చేయాలో దిక్కుతోచని పరిస్థితిలో ఉన్నాను. ప్రభుత్వమే తమలాంటి రైతులను ఆదుకోవాలి.

– చిగిలి సోమలింగ, యువరైతు అలసందగుత్తి

క్షయవ్యాధి నిర్మూలనకు కృషి చేయాలి

ఆదోని టౌన్: క్షయవ్యాధి నిర్మూలనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని మెడికల్ ఆఫీసర్ డాక్టర్ పృథ్వీరాజ్ పిలుపునిచ్చారు. బుధవారం పట్టణంలోని 17వ వార్డులోని ఎంఎం కాలనీలో క్షయ వ్యాధి నిర్మూలనపై ర్యాలీ నిర్వహించారు. కాలనీ వాసులకు అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ రెండు వారాలకు మించి దగ్గు, జ్వరం, గళ్లలో తెమడ మరియు రక్తం పడడం, ఛాతిలో నొప్పి తదితర లక్షణాలు ఉంటే ప్రభుత్వ ఆసుపత్రిలో గళ్ల పరీక్ష చేయించుకోవాలన్నారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్లు బాబురాజు, సీతారాముడు, మేరీ అరుణ, సుబ్బమ్మబాయి పాల్గొన్నారు.

యాజమాన్య పద్ధతులతో పంటలను కాపాడుకోండి

పెద్దకడబూరు : యాజమాన్య పద్ధతుల ద్వారా అధిక వర్షాలతో వివిధ రకాల పంటలు ముంపునకు గురి కాకుండా కాపాడుకోవచ్చునని మండల వ్యవసాయాధికారిణి సుచరిత తెలిపారు. బుధవారం ఆమె మాట్లాడుతూ పొలాలలో నిల్వ వున్న నీటిని వీలైనంత త్వరగా బయటకు పంపించే ఏర్పాటు చేయాలన్నారు. ముఖ్యంగా పంటలు నీటికి ఎర్రబడకుండా, చీడపీడలు సోకకుండా తగు జాగ్రత్తలు పాటించాలన్నారు. పత్తి పంటలో వర్షం తెరపిచ్చాక అవసరాన్ని బట్టి పోటాషియం నైట్రేట్‌ను 7 నుంచి 10 రోజుల వ్యవధిలో రెండుసార్లు పిచికారీ చేసుకోవాలన్నారు. పొలం ఆరిపోయి అనువుగా ఉన్నప్పుడు అంతర సేద్యం చేసుకోవాలని, కలుపును తీసివేయాలని సూచించారు.

క్లుప్తంగా

రైతులను ఆదుకోవాలి



నీట మునిగిన పత్తి పంటను పరిశీలిస్తున్న యల్లప్ప, సచివాలయ సిబ్బంది

పెద్దకడబూరు : వర్షపు నీటితో పంటలు నీట మునిగి నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని వైఎస్సార్ సీపీ రైతు విభాగం నియోజకవర్గ అధ్యక్షుడు యల్లప్ప కోరారు. మండల పరిధిలోని చిన్నతుంబళం గ్రామంలో రాయల చెరువు చుట్టూ ఉన్న దాదాపు 60 నుంచి 70 ఎకరాలలో వేసిన పంటలు వర్షపు నీటితో మునిగిపోయాయి. నీట మునిగిన పంటలను బుధవారం రైతుసేవా కేంద్రం సిబ్బంది లోకేష్‌తో కలసి పరిశీలించారు. చేతికి వచ్చిన పంటలు నీటిపాలు అవ్వడంతో రైతులకు అప్పులే మిగిలాయని, ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి రైతులకు న్యాయం చేయాలని కోరారు.

హోరాహోరీగా బండలాగుడు పోటీలు



మొదటి బహుమతి అందజేస్తున్న సర్పంచు తెల్లబండ్ల భీమయ్య

మంత్రాలయం : రాఘవేంద్రస్వామి ఉత్సవాలను పురస్కరించుకుని మండల కేంద్రంలో పార్టీలకు అతీతంగా బండలాగుడు పోటీలు నిర్వహించారు. సంత మార్కెట్ మైదానంలో బుధవారం జరిగిన గ్రామస్థాయి పోటీ పోటీల్లో వనికె రాము కాడెద్దులు మొదటిస్థానం దక్కించుకున్నాయి. రెండోస్థానంలో ఈడిగ గోవిందు కాడెద్దులు, మూడో స్థానంలో ఎర్రమూతుల గోవిందు కాడెలు నిలిచాయి. విజేతలకు దాతల సహకారంతో వరుసగా రూ.15,116, రూ.10,116, రూ.5,116 నగదును సర్పంచు చేతుల మీదుగా అందజేశారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం



మృతుడి భార్యకు నగదు అందజేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

పెద్దకడబూరు : బాధిత కుటుంబానికి అండగా ఉంటామని మండల పరిధిలోని జాలవాడి గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ నాయకుడు బోయ కంబగిరి గోపాల్ అన్నారు. జాలవాడి గ్రామానికి చెందిన కురువ జంపాపురం ఆంజనేయులు(35) హైదరాబాద్‌లో వలస వెళ్లిన చోట గత బుధవారం విద్యుదాఘాతానికి బలై చనిపోయిన విషయం విధితమే. దీంతో కంబగిరి గోపాల్ బుధవారం మృతుని కుటుంబాన్ని పరామర్శించి భార్య లక్ష్మికి రూ. 6వేలు ఆర్థిక సహాయాన్ని అందజేశారు. కుటుంబానికి అండగా ఉంటామని భరోసా నిచ్చారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యుడు కురువ వెంకటేశ్వర్లు, నాయకులు చాకలి నల్లారెడ్డి, వడ్డే బాబు, బోయ బాబు, కురువ నరసింహులు పాల్గొన్నారు.

యూరియా పంపిణీలో ప్రభుత్వం విఫలం

ఎమ్మిగనూరుటౌన్: ఖరీఫ్ సీజన్ ప్రారంభమైనా సకాలంలో రైతులకు కావాల్సిన యూరియా అందించడంలో కూటమి ప్రభుత్వం ఘోరంగా విఫలమైందని ఏపీ రైతు సంఘ జిల్లా కార్యదర్శి పంపన్న గౌడ్ ఆరోపించారు. బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. యూరియా కృత్రిమ కొరత సృష్టిస్తున్నా ప్రభుత్వం పట్టించుకోకపోవడం దారుణమన్నారు. రైతులకు ప్రభుత్వం నిర్ణయించిన ధరకే యూరియా అందించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో ఆ సంఘ నాయకులు గిడ్డయ్య, శాంతన్న తదితరులు పాల్గొన్నారు.

సమాచార హక్కు చట్టంపై అవగాహన అవసరం



ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

కౌతాళం: సమాచార హక్కు చట్టంపై ప్రతి పౌరుడు అవగహన కలిగి ఉండాలని కౌతాళం సింగల్ విండో అధ్యక్షుడు వెంకటపతిరాజు అన్నారు. సమాచార హక్కు చట్టం (ఆర్‌టీఐ యాక్ట్ 2005)పై అవగాహన ర్యాలీని బుధవారం మండల కేంద్రమైన కౌతాళంలో నిర్వహించారు. ఈ సందర్భంగా వెంకటపతి రాజు, కౌతాళం, బదినేహాల్ సింగల్ విండో అధ్యక్షులు వెంకటేష్, శివరాంలు చట్టం ప్రాముఖ్యత, దాని ద్వారా ప్రజలకు కలిగే ప్రయోజనాల గురించి వివరించారు. కార్యక్రమంలో డైరెక్టర్లు వీరేష్, నబిసాబ్, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రతి పంచాయతీని ఉన్నతంగా తీర్చిదిద్దుకోవాలి



మండల పరిషత్ కార్యాలయం ఆవరణంలో మొక్కలను నాటుతున్న ఎంపీపీ

పెద్దకడబూరు : మండలంలోని ప్రతి పంచాయతీని ఉన్నతంగా తీర్చిదిద్దుకునేందుకు ప్రతి ఒక్కరూ తోడ్పాటునందించాలని ఎంపీడీఓ ప్రభావతి సూచించారు. మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం ఎంపీపీ శ్రీవిద్య ఆధ్వర్యంలో పంచాయతీల పురుగతిపై ఒక్కరోజు శిక్షణ తరగతులు నిర్వహించారు. ఎంపీపీ మాట్లాడుతూ.. పంచాయతీల అభివృద్ధికి ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, ఎంపీపీ, జెడ్పీటీల సహకారం కచ్చితంగా ఉంటుంది, ముందు పంచాయతీ నిధులు మంజూరు చేయాలని కోరారు. వర్షాకాలం మండలంలోని అన్ని పంచాయతీలలో రోడ్లన్నీ బురదమయంగా మారాయన్నారు. డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా మారి దోమలు అధికమయ్యి ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. 15వ ఫైనాన్స్ నిధులు లేక పంచాయతీల అభివృద్ధి నీరుగారి పోయిందన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చిననాటి నుంచి ఎంపీటీసీ సభ్యులకు కనీసం గౌరవ వేతనం కూడా నోచుకోవడం లేదని మండిపడ్డారు. ఇవన్నీ మంజూరు చేస్తే పంచాయతీలతో పాటు మండలం కూడా అభివృద్ధి దిశలో దూసుకుపోతుందని చెప్పారు. అనంతరం మండల పరిషత్ కార్యాలయం ఆవరణంలో మొక్కలను నాటారు. కార్యక్రమంలో తహసీల్దారు గీతాప్రియదర్శిని, డిప్యూటీ ఎంపీడీఓ జయరాముడు, డాక్టర్ కేజియా, వివిధ శాఖల మండల అధికారులు పాల్గొన్నారు.

ఆర్టీసీ ఉద్యోగుల డిమాండ్లను పరిష్కరించాలి



ఆందోళన చేస్తున్న నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోసియేషన్ నాయకులు

ఆదోని టౌన్: ఆర్టీసీ ఉద్యోగుల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోసియేషన్ డిపో అధ్యక్షుడు ఎల్.బసవరాజు, వర్కింగ్ ప్రెసిడెంట్ ఆంజనేయులు, డిపో కార్యదర్శి రామలింగప్ప డిమాండ్ చేశారు. ఈ మేరకు రెండో రోజూ బుధవారం స్థానిక డిపో ఎదుట ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. వారు మాట్లాడుతూ విజయవాడలోని గన్నవరం–2 డిపోకి చెందిన 4.15 ఎకరాల స్థలాన్ని లూలూ సంస్థకు బదలాయిస్తూ రాష్ట ప్రభుత్వం ఇచ్చిన జీవోను ఉపసంహరించుకోవాలన్నారు. విశాఖ స్టీల్ ప్లాంట్ డిపోను తరలించడం, ఉద్యోగులకు రావాల్సిన అన్ని బకాయిలతో పాటు కాంట్రాక్ట్ కార్మికులను రెగ్యులర్ చేయాలన్నారు. కార్యక్రమంలో జాయింట్ సెక్రటరీ పి.ఖాజాహుసేన్, వీరేష్, బాలకృష్ణ, గ్యారేజ్ కార్యదర్శి ఎం.షరీఫ్, గ్యారేజ్ ప్రెసిడెంట్ కె.ఎ.జె.ఎస్.సతీష్‌కుమార్, మౌనేష్, అబ్దుల్లా, హనుమంతు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి పనుల్లో అవినీతి బట్టబయలు



సామాజిక తనిఖీలో విచారిస్తున్న డ్వామా పీడీ వెంకటరమణయ్య

ఎమ్మిగనూరురూరల్: ఉపాధి హామీ పనులపై జరిగిన సామాజిక తనిఖీలో అవినీతి బట్టబయలయ్యింది. బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యలయంలో నిర్వహించిన 18వ సోషల్ ఆడిట్ బహిరంగ సమావేశానికి డ్వామ పీడీ వెంకటరమణయ్య హాజరయ్యారు. మండలంలో 16 పంచాయతీల్లోని ఉపాధి హామీ పథకం కింద 1491 పనులకు గాను రూ. 13,63,05,040లు ఖర్చు చేశారు. ఈ పనుల్లో రూ.83,140 అవినీతి జరిగినట్లు సామాజిక తనిఖీ బృందం సభ్యులు వెల్లడించారు. మండలంలోని 16 పంచాయతీల్లో మొత్తం మీద రూ. 50,140లు రికవరీకి, రూ.33,000లు పెనాల్టీ కింద చెల్లించాలని డ్వామా పీడీ ఆదేశించారు. కడిమెట్లలో చేపట్టిన పనులకు ఖర్చు చేసిన రూ.1,96,701పై విచారణకు ఆదేశించారు. సమావేశంలో ఎంపీపీ కేశన్న, అడిషనల్ పీడీ మాధవీలత, ఏపీడీ అలీపీరాం, డీవీఓ లక్ష్మణ్, ఇన్‌చార్జ్ ఎంపీడీఓ సందీప్ తదితరులు పాల్గొన్నారు.

21న మహిళల రగ్బీ పోటీలు

కర్నూలు (టౌన్): స్థానిక ఆదర్శ విద్యా మందిర్ క్రీడా ప్రాంగణంలో ఈనెల 21న ఖేలో ఇండియా మహిళల రగ్బీ పోటీలు నిర్వహించనున్నట్లు రగ్బీ సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు రామాంజనేయులు, గుడిపల్లె సురేంద్ర బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా, రగ్బీ ఇండియా సంయుక్త ఆధ్వర్యంలో అండర్–15 విభాగంలో బాలికలకు ఈ పోటీలు నిర్వహించనున్నట్లు వెల్లడించారు. వివరాలకు 93038 27585 సెల్ నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

ఉరుకుందలో భక్తుల రద్దీ



పూజలందుకుంటున్న ఈరన్నస్వామి



దీపాలను అందజేస్తున్న దాతలు

కౌతాళం: ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన ఉరుకుంద ఈరన్న స్వామి దేవాలయంలో శ్రావణమాస ఉత్సవాల్లో భాగంగా మూడవ గురువారం స్వామి వారిని దర్శించుకోవడానికి బుధవారం నుంచే భక్తుల రద్దీ కొనసాగింది. శ్రావణమాస ఉత్సవాల్లో మూడవ గురువారం కావడంతో భక్తులు బుధవారం ఉదయం నుంచే స్వామి దర్శనానికి తరలిరావడంతో ఆలయ పరిసరాల్లో భక్తుల సందడి నెలకొంది. ఆలయ పరిసరాలలో ప్రత్యేక వంటకాలను వండి స్వామి వారికి నైవేద్యంగా సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. అర్చకులు తెల్లవారుజామున 4గంటలకు సుప్రభాతసేవ, మహామంగళహారతి, ఆకుపూజ, బిందుసేవ, పంచామృతాభిషేకం తదితర ప్రత్యేక పూజల అనంతరం భక్తులను దర్శనానికి వదిలారు. స్వామి వారి దర్శనం కోసం అధిక సమయం పట్టింది. భక్తుల సౌకర్యార్థం ఆలయ అధికారులు అతిశీఘ్ర దర్శనంతో పాటు ప్రత్యేక దర్శనం, శీఘ్రదర్శనం ఏర్పాటు చేయడంతో స్వామి దర్శన కార్యక్రమం సాఫీగా సాగిపోయింది.

వెండి దీపాల విరాళం

ఈరన్న స్వామి దేవాలయానికి బెంగళూరు వాస్తవ్యులైన తేజస్సురాజు, కుంటుంబ సభ్యులు కేజీ 50గ్రాముల వెండి దీపాలను అందజేశారు. దాతలకు ఆలయ అధికారులు సంప్రదాయం ప్రకారం స్వామి సన్నిధిలో ప్రత్యేక పూజలను చేయించి స్వామి వారి తీర్థప్రసాదాలను, పూలమాల, స్వామి వారి శేష వస్త్రాలు, లడ్డులను, బాండును, ఫొటోను అందజేశారు. ఆలయ డిప్యూటి కమిషనర్ వాణి, ఆలయ పర్యవేక్షకులు మల్లికార్జున, వెంకటేష్, సీనియర్ అసిస్టెంట్ కిరణ్‌లు పాల్గొన్నారు.

నిమజ్జనం రోజున పాత రోడ్డుకు అనుమతివ్వాలి

ఆదోని అర్బన్: వినాయక నిమజ్జనం రోజున పాత రోడ్డుకు అనుమతినివ్వాలని గణేష్ ఉత్సవ సమితి సభ్యులు కునిగిరి నీలకంఠ అన్నారు. బుధవారం కర్నూలులో జిల్లా కలెక్టర్ రంజిత్ బాషా అధ్యక్షతన జరిగిన ఉత్సవ కమిటీ, అధికారుల సమావేశంలో కునిగిరి నీలకంఠ మాట్లాడారు. ఆదోని పట్టణంలోని వినాయక నిమజ్జనం రోజున అనంత మంగళ ఆంజనేయస్వామి దేవాలయం, టూటౌన్ పోలీస్ స్టేషన్ మీదుగా వినాయక నిమజ్జనానికి అనుమతి ఇవ్వాలని, పట్టణంలో విద్యుత్‌కు సంబంధించిన సమస్యలు వీలైనంత త్వరగా పరిష్కరించాలని కోరారు. ఇందుకు కలెక్టర్ స్పందిస్తూ త్వరలోనే ఆదోని పట్టణంలో పర్యటించి ప్రభుత్వ శాఖల అధికారులతో సమావేశమై సమస్యలను పరిష్కరిస్తామని చెప్పారన్నారు.

సస్యరక్షణ పద్ధతులు పాటించాలి

మంత్రాలయం రూరల్ : పంటల సాగులో ప్రతి ఒక్కరూ సస్య రక్షన పద్ధతులు పాటించాలని జిల్లా ఆధునిక వ్యవసాయ సాంకేతిక యాజమాన్య సంస్థ ఏఓ హేమలత, టెక్నికల్ ఏఓ అనిల్ రైతులకు సూచించారు. బుధవారం మండలంలోని కల్లుదేవకుంట, చిలకలడోణ గ్రామాల్లో అవగాహన సదస్సు నిర్వహించారు. సదస్సులో వారు రైతులకు పలు సూచనలు చేశారు. పత్తి పంటను ఆశించే తెగుళ్ళ, కీటకాలను వివరించి పరిష్కారాలు చెప్పారు. పచ్చదోమ, పేనుబంక రాకుండా చూసుకుంటే దిగుబడులు తగ్గకుండా ఉంటాయన్నారు. కార్యక్రమంలో ఏఈఓ తిరుమలరెడ్డి, రైతు సేవా సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

కాంట్రాక్ట్ కార్మికుల సమస్యలు పరిష్కరించండి

ఎమ్మిగనూరుటౌన్: విద్యుత్‌శాఖలో కాంట్రాక్ట్ పద్ధతిలో పని చేస్తున్న కార్మికుల సమస్యలను ప్రభుత్వం సత్వరం పరిష్కరించాలని యునైటెడ్ ఎలక్ట్రిసిటీ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి భీమేష్ చౌదరి, డివిజన్ అధ్యక్షుడు ప్రవీణ్ కుమార్ డిమాండ్ చేశారు. బుధవారం స్థానిక కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులందరినీ సంస్థలో విలీనం చేసి రెగ్యులర్ చేయాలని కోరారు. సమావేశంలో యూనియన్ కార్యదర్శి యునిస్‌బాషా, కోసిగి సబ్‌డివిజన్ నాయకులు మిన్నప్ప, నరసన్న తదితరులు పాల్గొన్నారు.

తిప్పనూరులో కూలిన మట్టిమిద్దె

గోనెగండ్ల : మండల పరిధిలోని తిప్పనూరు గ్రామంలో మంగళవారం అర్ధరాత్రి పింజారి ఖాజాబీకు చెందిన మట్టిమిద్దె కూలిపోయింది. మండలంలో గత ఐదు రోజులుగా వర్షాలు కురుస్తున్నాయి. దీంతో తిప్పనూరుకు చెందిన పింజారి ఖాజాబీ మట్టిమిద్దె మెత్తబడి కూలింది. ఖాజాబీ ఆమె కుమారుడు, మానుమరాళ్లతో మంగళవారం రాత్రి ఇంట్లో ముందు భాగంలోని గదిలో పడుకున్నారు. అయితే వెనుక గది కూలడంతో ప్రమాదం నుంచి తప్పించుకున్నారు. ఆ గదిలో ఉన్న సామాన్లు, బియ్యం ఇతరత్రా సామగ్రి మొత్తం మట్టిలో కూరుకుపోయాయి. ఖాజాబీ గ్రామంలో కూలీ పనులు చేస్తూ కుమారుడు, మానవరాళ్లను పోషిస్తోంది. ఇళ్లు కూలిపోవడంతో ఆ కుటుంబం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటోందని గ్రామస్తులు తెలిపారు. ఆ కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

15, 16న మాంసం విక్రయాలు నిషేధం

ఆదోని టౌన్: ఈనెల 15వ తేదీన 79వ స్వాతంత్ర్య దినోత్సవం, 16వ తేదీన శ్రీ కృష్ణ జన్మాష్టమి సందర్భంగా సందర్భంగా మటన్, చికెన్, అన్ని రకాల నాన్ వెజ్‌టేరియన్ వ్యాపారాలను చేపట్టరాదని ఆదోని మున్సిపల్ కమిషనర్ ఎం.కృష్ణ ఆదేశించారు. ఎవరైనా మటన్, చికెన్ నిర్వాహకులు, హోటళ్ల యజమానులు విక్రయాలు చేపడితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

వరద నియంత్రణ చర్యల్లో నిర్లక్ష్యం తగదు



ఆనకట్టను పరిశీలిస్తున్న సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్

గోనెగండ్ల : ప్రస్తుతం వర్షాలు కురుస్తున్నందున వరద నియంత్రణ, సహాయక చర్యలు చేపట్టే సమయంలో అధికారులు సిబ్బంది ఎలాంటి నిర్లక్ష్యం చేయరాదని ఆదోని సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్ అన్నారు. బుధవారం మండలంలోని గాజులదిన్నె ప్రాజెక్టును సబ్ కలెక్టర్ పరిశీలించారు. క్రస్ట్ గేట్లు పనితీరు, నీటి నిల్వ, ఆనకట్ట పనులను పరిశీలించారు. ప్రాజెక్టు వివరాలను ఏఈ మహమ్మద్ అలీని అడిగి తెలుసుకున్నారు. ప్రాజెక్టులో ప్రస్తుతం 1.8(లైవ్) టీఎంసీల నీరు నిల్వ ఉందని, జీడీపీకు 4.5 టీఎంసీల నీరు నిల్వ చేసే సామర్థ్యం ఉందని, ఆరు గేట్లలో నాలుగు సక్రమంగా పని చేస్తున్నాయని ఏఈ సబ్ కలెక్టర్‌కు వివరించారు. అలాగే హంద్రీనీవా నుంచి 160 క్యూసెక్కులు, ఎల్లెల్సీ కాలువ నుంచి 84 క్యూసెక్కులు, వరద నీరు 150 క్యూసెక్కుల నీరు జీడీపీలోకి వస్తుందని తెలిపారు. అలాగే అత్యవసర ప్రణాళికపై పూర్తి నివేదికను సబ్ కలెక్టర్ తీసుకున్నారు. ప్రాజెక్టు వద్ద ఖచ్చితంగా భద్రత ప్రమాణాలు పాటించాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో తహసీల్దార్ రాజేశ్వరి, ఇరిగేషన్ అధికారులు పాల్గొన్నారు.

రేషన్ సక్రమంగా పంపిణీ చేయాలి

రేషన్ పంపిణీని డీలర్లు సరుకులు సక్రమంగా పంపిణీ చేయాలని ఆదోని సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్ సూచించారు. బుధవారం మండల కేంద్రంలోని రేషన్ షాపులను ఆకస్మికంగా తనిఖీ చేశారు. సరుకులు పంపిణీ వివరాలపై ఆరా తీశారు. అలాగే 65 సంవత్సరాలు పైబడిన వృద్ధులు, దివ్యాంగులకు రేషన్ డోర్ డెలివరీ ఎంత శాతం పూర్తి చేశారని డీలర్లను అడిగి తెలుసుకున్నారు.

అవయవదానం చేసేందుకు ముందుకు రావాలి



మాట్లాడుతున్న అవోపా పట్టణాధ్యక్షులు వంకదారు శ్రీనాథ్‌గుప్తా

ఆదోని అర్బన్: అవయవదానం చేసేందుకు ప్రతిఒక్కరూ ముందుకు రావాలని అవోపా పట్టణాధ్యక్షులు వంకదారు శ్రీనాథ్‌గుప్తా పిలుపునిచ్చారు. వరల్డ్ ఆర్గాన్ డొనేషన్ డే (ప్రపంచ అవయవ దాన దినోత్సవం) సందర్భంగా బుధవారం ఆదోని ఆర్య వైశ్య అఫీషియల్స్ అండ్ ప్రొఫెషనల్ అసోసియేషన్ (అవోపా) అండ్ ప్రపంచ ఆర్యవైశ్య మహాసభ (వామ్) వారి సంయుక్త ఆధ్వర్యంలో అవయవ దానంపై అవగాహన సదస్సును స్థానిక పద్మావతి ఒకేషనల్ కాలేజీలో నిర్వహించారు. అవోపా పట్టణాధ్యక్షులు వంకదారు శ్రీనాథ్‌గుప్తా, ముఖ్య అతిథిగా హాజరైన డాక్టర్ లేవుడాల మిథిలేష్‌కుమార్ మాట్లాడుతూ మనిషి చనిపోయిన తర్వాత అవయవదానం చేయడం ద్వారా వారి అవయవాలు జీవిస్తూనే ఉంటాయన్నారు. అవయవదానం చేయడంతో మరొకరికి జీవితం ప్రసాదించిన వారవుతారన్నారు. కాగా, పారా మెడికల్ ఉపాధ్యాయిని తన అవయవాలను దానం చేయడానికి సుముఖత చూపింది. పరుచూరి సువర్ణమ్మ అనే గృహిణి తన కళ్లను దానం చేయడానికి ప్రతిజ్ఞ చేసింది. అలాగే హర్షిని, గాయత్రీ, వైష్ణవి, అఖిల, గీత, పారా మెడికల్ విద్యార్థులు కూడా రక్తదానం చేయడానికి, కళ్లను దానం చేయడానికి ముందుకొచ్చారు. కార్యక్రమంలో అవోపా కార్యదర్శి రఘు, కోశాధికారి యాదగిరి, వెంకటేశ్వర్లు, సభ్యులు రాఘవేంద్ర, అవోపా మహిళా విభాగం అధ్యక్ష కార్యదర్శులు మమతాశ్రీ, శ్రీదేవి, కాలేజ్ కరస్పాండెంట్ విరుపాక్షి, ప్రిన్సిపాల్ రామలింగారెడ్డి పాల్గొన్నారు.

తిరంగా ర్యాలీ



130 అడుగుల జాతీయ జెండాతో విద్యార్థుల ర్యాలీ

ఆదోని సెంట్రల్: హర్ ఘర్ తిరంగా మహోత్సవంలో భాగంగా పట్టణంలో ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల విద్యార్థినీ, విద్యార్థులు 130 అడుగుల జాతీయ జెండాను ప్రదర్శించారు. బుధవారం కళాశాల ప్రిన్సిపాల్ మురళీ మోహన్ అధ్యక్షతన ప్రదర్శన కార్యక్రమం నిర్వహించారు. అధ్యాపకులు ఎర్రిస్వామి ఎన్ఎస్ఎస్ డివిజన్ అధికారి జోనాథన్ వీక్లిఫ్, ఎన్‌సీసీ అధికారి గోవిందు పర్యవేక్షలో జరిగిన ఈ ప్రదర్శన ఆర్ట్స్ కళాశాల మైదానం నుంచి ప్రారంభమై ఎమ్మిగనూర్ సర్కిల్ మీదుగా పట్టణ పురవీధుల గుండా కొనసాగింది. ఈ సందర్భంగా హర్ ఘర్ తిరంగా అంటూ నినాదాలు చేస్తే ముందుకు కదిలారు.

వికసించిన బ్రహ్మ కమలం



ఆదోని అర్బన్: పట్టణంలోని ఆర్టీసీ కాలనీలో మంజుల అనే మహిళ ఇంట్లో బ్రహ్మకమలం వికసించింది. అరుదుగా కనిపించే బ్రహ్మకమలం పుష్పం వికసించడంతో చుట్టుపక్కల కాలనీవాసులు తరలివచ్చి తిలకించారు. పలువురు పూజలు చేశారు. ఈ చెట్టును గత ఆరు సంవత్సరాల క్రితం నాటగా, తొలిసారిగా వికసించిందని యజమాని తెలిపారు.

పౌరహక్కులపై అవగాహన ఉండాలి



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న ఫోరం నాయకులు

ఎమ్మిగనూరుటౌన్: పౌరహక్కులపై ప్రతి ఒక్కరు అవగాహన కలిగి వుండాలని సీఆర్ఐఐ సభ్యులు డాక్టర్ పి.సురేష్, సభ్యులు కొమ్ముపాలెం శ్రీనివాసులు, బహుజన్ సివిల్ రైట్స్ ఫోరం(బీసీఆర్ఎఫ్) నిర్వాహకులు సునీల్‌కుమార్, ముత్తు, రవి, ప్రభాకర్, దిలీప్‌కుమార్ అన్నారు. బుధవారం పట్టణంలోని పద్మశాలి కల్యాణ మండపంలో బీసీఆర్ఎఫ్ ఆధ్వర్యంలో పౌరహక్కులపై అవగాహన కల్పించారు.